క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారం



చిత్రావతి నదిలో చేతి బోరు వేస్తున్న కూలీలు

బత్తలపల్లి: పంచాయతీలో నిధులు లేకపోయినా సర్పంచ్ తన సొంత నిధులు వెచ్చించి ప్రజల దాహార్తిని తీర్చాడు. వివరాలు.. మండలంలోని దంపెట్ల పంచాయతీ పరిధిలోని ఉప్పర్లపల్లికి చిత్రావతి నది నుంచి నీరు సరఫరా అవుతోంది. కొంత కాలంగా చెరువు నీరు, ఇతర నీరు చేరి బోరు కలుషితమైంది. దీంతో నీరు ఎర్రగా వస్తుండడంతో ప్రజలు సమస్యను సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన పంచాయతీలో నిధులు లేకపోయినా.. సొంత నిధులు రూ.2 లక్షలు వెచ్చించి నూతనంగా బోరు వేయించి, కొత్తగా పైపులైను వేయించి నీరు సరఫరా చేయించారు. దాహార్తిని తీర్చినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఆర్డీటీ సిబ్బంది

బత్తలపల్లి: క్రీడలతో మానసిక ఆరోగ్యం సాధ్యమని డీఐడీ కో ఆర్డినేటర్ రామకృష్ణ అన్నారు. ఆదివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆర్డీటీ ఆస్పత్రి క్యాంపస్‌లో ఉన్న చిల్డ్రన్ హోమ్స్ విద్యార్థినీ, విద్యార్థులకు ఈ నెల 29 నుంచి మూడు రోజుల పాటు క్రీడా పోటీలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధ్యాన్ చంద్ జయంతిని పురష్కరించుకుని ఏటా జాతీయ క్రీడా దినోత్సవం చేసుకుంటున్నామన్నారు. ఖోఖో, స్కిప్పింగ్, రన్నింగ్, సైక్లింగ్, ఫుట్‌బాల్ తదితర పోటీల్లో 21 మంది బాలురు, 22 మంది బాలికలు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వార్డన్లు పుష్పలత, యల్లప్ప, ఉపాధ్యాయులు సరోజ, గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం ఎంపిక



కమిటీ సభ్యులతో ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం మండల ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం ఎన్నికల అధికారి బలరాముడు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి, రాష్ట్ర నాయకుడు బీకే ముత్యాలప్ప, రాష్ట్ర కౌన్సిలర్ పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఏపీటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడిగా ఎం.బయన్న, అధ్యక్షుడిగా శివానంద, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరయ్య, ఉపాధ్యక్షులుగా లక్ష్మీ నరసయ్య, భవాని, సంజీవప్ప, చంద్రశేఖర్, కవిత, కార్యదర్శులుగా శ్రీరంగప్రసాద్, ఆదినారాయణ, స్వరూప, సి.ఆదినారాయణ, పెద్ద ఓబిలేసు, జిల్లా కౌన్సిలర్లుగా నాగరాజు, తిప్పన్న, హేమంత్‌కుమార్, శంకర్‌నారాయణ, కళావతి, వాసుకుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా గురుమూర్తి, ఆడిట్ కమిటీ సభ్యులుగా కుళ్లాయప్ప, వెంకటేష్‌నాయక్ ఎన్నికయ్యారు.

పొంచి ఉన్న ప్రమాదం



కదిరి- హిందూపూరం ప్రధాన రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలు

ఓడీచెరువు: మండల కేంద్రంలో రద్దీగా వుండే స్టేట్‌బ్యాంక్ పక్కన కదిరి- హిందూపూరం ప్రధాన రహదారిలో ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తీగలు అల్లుకోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల విద్యుదాఘాతంతో గాజుకుంటపల్లికి చెందిన ఓ మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. ఒక్క విద్యుత్ శాఖ మాత్రమే కాక అన్ని శాఖల అధికారులు నిత్యం ప్రయాణించే రోడ్డు అది. అయినా ఏ ఒక్కరికీ పట్టలేదంటే పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బైబై గణేశా..



బుక్కపట్నం మండలం కడపనాగేపల్లిలో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళుతున్న దృశ్యం



పుట్టపర్తిలోని ప్రశాంతి గ్రాం వద్ద ట్రాక్టర్‌లో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



వినాయకుడి ఊరేగింపులో నల్లమాడ ఎస్సీ కాలనీవాసులు



తలుపులలో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడు

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో ప్రశాంతిగ్రాం, ఎనుములపల్లి, బీడుపల్లి ప్రాంతాల్లో పలు వినాయక ప్రతిమలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ప్రజలు ఆనందోత్సాహాల నడుమ డప్పు మేళాలతో విగ్రహాలు తరలివెళ్లాయి. గణపతి విగ్రహాలను వాహనాల్లో ఊరేగిస్తూ ఎనుములపల్లి, సాహెబ్‌చెరువుకు తరలించారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ విజయకుమార్, సీఐ శివాంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీతో పాటు పీర్లచావిడి వద్ద ఓంకార గణపతి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. పీర్లచావిడి వద్ద ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సమీపంలోని చెరువులో గణనాథులను గంగ ఒడికి చేర్చారు.

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వినాయక విగ్రహాల నిమజ్జనం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తాడిమర్రి, పిన్నదరి గ్రామాల్లో వీధుల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను యువకులు ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా నీటి కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

తలుపుల : మండలంలోని వినాయక ప్రతిమలను ఐదోరోజు ఆదివారం నిమజ్జనానికి తరలించారు. గ్రామాల సమీపంలోని కుంటల్లో నిమజ్జనం చేశారు.

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లి గ్రామంలో ఆదివారం యోగి వేమన ఆలయ పీఠాధిపతి నందవేమారెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో వైభవంగా వినాయక నిమజ్జనం చేశారు. వీధుల్లో వినాయక ప్రతిమలను ఊరేగించారు. కేరళ రాష్ట్రం వాయిద్యాలతో కోలాట నృత్యం ఎంతో ఆకట్టుకుంది. అనంతరంసమీపంలోని కుంటలో నిమజ్జనం చేశారు. శిక్షణ ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

లడ్డూ ప్రసాదం వితరణ

మండలంలోని పోరెడ్డివారి పల్లిలో వినాయక నిమజ్జనానికి కదిరి మార్కెట్ యార్డు డైరెక్టర్, బీజేపీ మైనార్టీ నాయకులు షేక్ సమీవుల్లా ఆదివారం లడ్డూ ప్రసాదాన్ని గ్రామస్తులకు అందించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు సామాల కేశవరెడ్డి, చిన్న బాబాఫక్రుద్దీన్, నాగార్జునరెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



ఎన్పీకుంట: నిమజ్జనానికి తరలిన గణనాథుడు



బుక్కపట్నం మండలం కడపనాగేపల్లిలో ఉట్టిని కొడుతున్న దృశ్యం



తాడిమర్రిలో వినాయకుడి విగ్రహం ఊరేగింపు ఎదుట భక్తుల నృత్యాలు



గాండ్లపెంట మండలం కటారుపల్లిలో వినాయక నిమజ్జనంలో పాల్గొన్న భక్తులు

15న లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి



కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

పుట్టపర్తి టౌన్: కూటమి ప్రభుత్వం భవన కార్మికులుకు ఇచ్చిన హామీలు నేరవేర్చక పోవడాన్ని నిరసిస్తూ సెప్టెంబర్ 15న లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడించనున్నట్లు భవన నిర్మాణ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భవన కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని, అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా సంక్షేమ బోర్డు విషయం గురించి ప్రస్తావించలేదన్నారు. ఈ విషయాన్ని సీఎం, డీసీఎం, మంత్రుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. జిల్లాలోని భవన కార్మికులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, ఉపాధ్యక్షులు బాబావలి, కోశాధికారి ముత్యాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, నాయకులు మహమ్మద్, నవీన్, దివాకర్‌నాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా రామకృష్ణనాయక్



రామకృష్ణనాయక్‌ను అభినందిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు

ధర్మవరం: యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ధర్మవరం పట్టణానికి చెందిన రామకృష్ణనాయక్‌ను ఎంపిక చేసినట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పరిగి మండలం జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ధర్మవరం పట్టణానికి చెందిన రామకృష్ణనాయక్‌ను జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రామకృష్ణనాయక్‌ను జిల్లా కార్యదర్శిగా ఎంపికకావడంతో ధర్మవరం జోన్ నాయకులు లక్ష్మయ్య, అమర్‌నారాయణరెడ్డి, సకల చంద్రశేఖర్, సురేష్, రమేష్, హరికృష్ణ, సాయిగణేష్, ఆంజనేయులు, రామంజినేయులు, రాంప్రసాద్, నాగిరెడ్డి, ఆదిశేషయ్య, హరిశంకర్, మేరీ వరకుమారి, లతాదేవి, నాగేంద్రమ్మ హర్షం వ్యక్తం చేశారు.

పాలన గాలికొదిలేసిన కూటమి సర్కారు



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి

నల్లచెరువు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలును గాలికి వదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మొండెం రవికుమార్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని బొమ్మిరెడ్డిపల్లిలో మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు దాసరి శ్రీనాథ్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, శ్రీకంఠరెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపాల్‌రెడ్డి అధ్యక్షతన గ్రామంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని ప్రజలను మభ్య పెట్టి ఎన్నికల్లో గెలిచి అధికారంలోకొచ్చారని, పీ–4 అనే కొత్త నాటకానికి తెరలేపి ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారన్నారు. అనంతరం ష్యూరిటీ- మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ టెంపుల్ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు కోనపల్లి రమణారెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, కదిరి నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ హైటెక్ రమణ, సాంబ శివారెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, మహేంద్రరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ఇ. వెంకటరమణారెడ్డి, బి.వెంకటరమణారెడ్డి, వి. చంద్రశేఖర్‌రెడ్డి, కె. శ్రీనివాసరెడ్డి, బి. శ్రీనివాసరెడ్డి, ఇ. శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీరాములు, నరసింహారెడ్డి, లక్ష్మీనారాయణ, కిష్టప్ప, నరసింహులు, నాగేంద్ర, విశ్వనాథ్, జయసుధ, నారాయణ, గంగాద్రి, గంగన్న, శ్రీనివాసులు, భాస్కర్ శంకర్, వెంకటరెడ్డి, భార్గవ, విష్ణు, రాజారెడ్డి, చంద్రా, రామచంద్రారెడ్డి, ట్రేడ్ యూనియన్ నాయకులు ఖాదర్‌వలి, మాజీ డైరెక్టర్ ఆదిమూర్తి ప్రధాన కార్యదర్శులు సలీం లక్ష్మీపతి, కృష్ణానాయక్, మండల కార్యదర్శులు కృష్ణమూర్తి, గ్రామ కన్వీనర్లు వీరా రెడ్డి, సూర్యశేఖర్‌రెడి (జేసీబి) తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు



శిల్పారామంలో భరతనాట్యం చేస్తున్న కళాకారులు

పుట్టపర్తి టౌన్: స్థానిక శిల్పారామంలో కళాకారులు తమ నృత్యాలతో ప్రేక్షకులను అలరించారు. ఆదివారం ఆహ్లాదం కార్యక్రమంలో భాగంగా ముంబైకు చెందిన శ్రీనృత్యోదయ నాట్య కళాలయం బృందం కళాకారులు భరత నాట్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఓ ఖాదర్‌వళి, పట్టణ వాసులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

ముదిగుబ్బ: ముదిగుబ్బ మండలం జొన్నల కొత్తపల్లి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున డివైడర్‌ను కారు ఢీకొంది. అయితే ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. అనంతపురంలోని వేణుగోపాల్ నగర్‌కు చెందిన రఘు తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారు పూర్తిగా దెబ్బతిన్నా ఏ ఒక్కరు గాయపడకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

'కులం పేరుతో వేధిస్తున్నారు'



మాట్లాడుతున్న అనిత, నారాయణస్వామి

ధర్మవరం: కులం పేరుతో వేధిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో 9వ వార్డు చిన్నూరు గ్రామానికి చెందిన అనిత.. భర్త నారాయణస్వామితో కలసి వివరాలు వెల్లడించారు. ఎస్సీ కులానికి చెందిన తాను 2019లో వడ్డెర కులానికి చెందిన నారాయణస్వామి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నామన్నారు. ముగ్గురు పిల్లలున్నారన్నారు. సజావుగా సాగుతున్న మా కాపురంలో తోడికోడలు అనిత, బావ శేషు కులం పేరుతో దూషిస్తూ పలుమార్లు దాడులు చేశారని ఆమె వాపోయింది. గ్రామంలో కూడా పలువురు కులంపేరుతో దూషించేవారన్నారు. శుక్రవారం చిన్నూరు గ్రామంలో వినాయక మండపానికి వెళితే నీవు ఎస్సీ కులానికి చెందిన దానివని ఎందుకు వచ్చావు? కొబ్బరికాయ కొట్టరాదని.. అసలు గ్రామంలోనే ఉండకూడదని దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం అదే రోజు రాత్రి ఇంటి వద్ద మళ్లీ దాడి చేశారన్నారు. తాను మనస్థాపంతో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా భర్త నారాయణస్వామి అడ్డుకుని కాపాడారన్నారు. నా తోడికోడలు, బావల నుంచి ప్రాణహాని ఉందని ఆమె తెలిపారు. వారిపై తగు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

అపూర్వ సమ్మేళనం



ఓడీచెరువు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2010–11 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా చాలా ఏళ్ల తర్వాత ఒకచోట కలవడంతో వారి ఆనందాలకు అవధుల్లేకుండా పోయాయి. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులు కృష్ణానాయక్, లక్ష్మినారాయణ,రవీంద్ర, రవిచంద్ర, బాల నరసింహప్ప, రిజ్వానుల్లా ఖాన్,మధుబాబు, నాగరాజు, శివప్రసాద్, ఉషారాణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాబా ఫక్రుద్దీన్, నారాయణ, అనిల్, అమర్‌నాథ్‌రెడ్డి, కళ్యాణ్, అనిత, నాగజ్యోతి, నాగరత్న తదితరులు పాల్గొన్నారు

లడ్డూ @ రూ.2.01 లక్షలు



వేలంలో లడ్డూ దక్కించుకున్న మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అయ్యప్పనాయుడు

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం, యర్రాయపల్లి గ్రామాల్లో ఆదివారం వినాయక విగ్రహాలను నిమ్మజ్జనం చేశారు. సంజీవపురంలో యూత్ నాయకులు ఏర్పాటు చేసిన మండపంలో లడ్డూ వేలం నిర్వహించగా ధర్మవరం మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ముల్లగూరు అయ్యప్పనాయుడు తన భార్య సరోజమ్మతో కలిసి వేలంలో పాల్గొన్నారు. వేలంలో వారు లడ్డూను రూ.2.01లకు దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటి సభ్యులు తెలిపారు. అనంతరం భారీ ఊరేగింపుతో వినాయకుల విగ్రహాలను నిమ్మజ్జనం చేసినట్లు ఆయా గ్రామాలకు చెందిన ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

రూ.84 వేలు పలికిన లడ్డూ ప్రసాదం

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని పీర్లచావిడి వద్ద ఓంకార గణపతి మిత్రమండలి ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వేలంలో గణనాథుని లడ్డూ రూ.84,000 ధర పలికింది. ఆదివారం వైఎస్సార్ కూడలి వద్ద వేలం పాట నిర్వహించగా, ఎన్పీకుంటకు చెందిన మామిళ్ల రఘునాథ (పిండిమిషన్ రఘు) లడ్డూను దక్కించుకున్నాడు.

డ్రైవర్ ఉద్యోగం కత్తి మీద సాములాంటిది





డ్రైవర్ కేశప్పను సన్మానిస్తున్న ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు, ఎస్ఐ శ్రీరాములును సన్మానిస్తున్న పోలీస్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ డ్రైవర్ ఉద్యోగం కత్తిమీద సాములాంటిదని వక్తలు పేర్కొన్నారు. పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న డ్రైవర్ శ్రీశైలం కేశప్ప ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు స్థానిక షాదీమహల్ ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఇదిలా ఉండగా పుట్టపర్తి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీరాములు ఉద్యోగ విమరణ చేయడంతో ఆయన్ను సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎస్ఐ సేవలను కొనియాడారు.

ఎరువులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలి

పుట్టపర్తిటౌన్: జిల్లా వ్యాప్తంగా ఎరువులు పక్కదారి పట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి కోరారు. ఈమేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో రైతులకు అందాల్సిన ఎరువులు పొరుగు రాష్ట్రాలకు వెళ్తున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలం చెందారని విమర్శించారు. పక్క జిల్లాతో పోల్చుకొంటే సగానికి సగం మాత్రమే జిల్లాకు ఎరువులు కేటాయించారని పేర్కొన్నారు. జిల్లాలో వరి మొక్కజొన్న పంటలు అధికంగా సాగు చేశారని యూరియా కొరతతో రైతులు చాలా మంది ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ధర్మవరం: పట్టణంలో సోమవారం విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఏడీ లక్ష్మినరసింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామ్‌నగర్‌లో 132/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉండటంతో ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకూ కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలన్నారు.